క్లుప్తంగా

ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు



ఊటగెడ్డ వద్ద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని ఊటగెడ్డ వద్ద ప్రధాన పైపులైన్ లీక్ కావడంతో కార్పొరేషన్ అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. నెల్లిమర్ల నుంచి నగరంలోని వివిధ రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్ లీక్ అవడంతో ఆదివారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ఊటగెడ్డ వద్దకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా అద్దేపల్లివారి వీధి, కమ్మవీధి, కొనిశవీధి, కోరాడవీధి, తుపాకులవీధి, కాటవీధి, చిక్కాలవీధి, మేదరవీధి, కంటుభుక్తవారి వీధి, లంకవీధి, రాజీవ్‌నగర్ కాలనీలలో నీటి సరఫరా నిలిచిపోయింది.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

విజయనగరం టౌన్: మహిళలు ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే వారు ఉన్నత చదువులు చదివి, లక్ష్యాలను చేరుకోగలరని అన్నదాత సుఖీభవ సంస్థ నిర్వాహకురాలు కాంచన విశ్వ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కణపాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం విద్యా ఉపకరణాలు, నోట్‌బుక్స్, విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంస్థ ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు విస్తృతం చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆర్.అశోక్, పి.శాంతికుమారి, టి. దుర్గ, కె.వంశీ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



నీలిమ, ఏఓ

పూసపాటిరేగ : తుఫాన్ ప్రభావతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల్లో వేసిన వరి పనలను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.నీలిమ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ, కోత కోసిన పనలను కుప్పలుగా వేసినప్పుడు ఎకరాకు 25 కిలోలు చొప్పున ఉప్పు పిచికారీ చేయాలని సూచించారు. గింజ మొలకెత్తకుండా ఉండటానికి లీటర్ నీటికి 50 గ్రాముల చొప్పున ఉప్పు కలిపిన ద్రావణాన్ని పనలపై చల్లాలన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం వర్షానికి తడవకుండా బద్రపరుచుకోవాలన్నారు. ధాన్యం తడిసినట్లయితే క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోలు పొడి ఊక కలిపి ధాన్యంతో కలిపి పోగుపెట్టడం వల్ల మొలకెత్తకుండా నివారించుకోవచ్చని తెలిపారు.

రామయ్య సన్నిధిలో మండలి విప్..



శాసనమండలి విప్ చిరంజీవిరావుకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామిని శాసనమండలి విప్ వేపాడ చిరంజీవిరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ సిబ్బంది ఆలయ సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికారు. ముందుగా ఆంజనేయస్వామిని దర్శించి సీతారాముని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో విప్ దంపతులకు అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు, కోటపాటి తిరుపతిరావు, సత్యనారాయణ, అట్టాడ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



ఎస్.కోట పట్టణ వాసులకు మొక్కలు పంపిణీ చేస్తున్న జియో రామకృష్ణ

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో పలువురికి ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 'పుట్టినరోజున పది మొక్కలు నాటుదాం' పేరుతో మొక్కల పంపిణీ కార్యక్రమం ఎప్పుడో ప్రారంభించామని చెప్పారు. సామాజిక అడవుల పెంపకంలో అంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, పంచాయతీ మాజీ వార్డు మెంబర్ బొబ్బిలి అప్పారావు, జియో సంస్థ ప్రతినిధులు హృషికేష్,లాస్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తరుగుతున్న చెత్త కొండలు





చెత్తను బయోమైనింగ్ చేస్తున్న యంత్రాలు

- డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త తొలగించేందుకు చర్యలు
- బయోమైనింగ్ పద్ధతిలో 2.06 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తకు కలగనున్న మోక్షం
- చెత్తను తరలించేందుకు రూ. 15 కోట్లకు పైగా వ్యయంతో ఒప్పందం
- ఇప్పటివరకు 62 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు పూర్తయిన బయోమైనింగ్

విజయనగరం:

నగరంలో సేకరించిన చెత్తను తరలించే గుణుపూరు డంపింగ్‌యార్డ్‌కు త్వరలో మోక్షం కలగనుంది. యార్డులో లక్షల టన్నుల్లో పేరుకుపోయిన చెత్త కొండలను బయోమైనింగ్ పద్ధతిలో తొలగించేందుకు చేపడుతున్న చర్యలు కొనసాగుతున్నాయి. సేకరించిన చెత్తాచెదారాన్ని ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుల్లో వదిలేయడంతో కొండల్లా పేరుకుపోయిన విషయం తెలిసిందే. డంపింగ్ యార్డు నగరానికి శివారున ఉండడంతో ఆ ప్రాంతాల్లో నివాసం ఉండే వారు దుర్వాసన, కలుషిత గాలితో ఇబ్బందులు పడ్డారు. తమను కాలుష్యం నుంచి కాపాడాలని ఆ ప్రాంత వాసులు కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించారు. ఈ వ్యవహారంలో అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో అమృత్ పథకం కింద డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కొండలను తొలగించేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రెండేళ్ల కిందట ఆయా డంపింగ్ యార్డుల్లో సర్వే చేపట్టింది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త దిబ్బలను తొలగించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో టెండర్లను పిలిచి పనులు ప్రారంభించింది. ఈ చెత్త తొలగింపునకు స్థానిక సంస్థల నిధులు 40 శాతం, రాష్ట్ర నిధులు 22 శాతం, కేంద్ర ప్రభుత్వం నిధులు 38 శాతం కేటాయించనున్నారు.

కార్పొరేషన్ పరిధిలో ఇదీ పరిస్థితి

జిల్లా కేంద్రమైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. 50 డివిజన్‌లలో విస్తరించిన విజయనగరంలో ప్రతిరోజూ 120 మెట్రిక్ టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. నగరంలో సేకరించిన చెత్తను ప్రతిరోజూ నగరానికి 9 కిలోమీటర్ల దూరంలో డెంకాడ మండలం గుణుపూరుపేట సమీపాన గల డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. ఇలా కొన్నేళ్లుగా తరలించిన చెత్త అధికారిక లెక్కల ప్రకారం 22 ఎకరాల విస్తీర్ణంలో 2,06,101 మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందని అంచనా. ఈ చెత్తను బయోమైనింగ్ పద్ధతిలో తరలించేందుకు గుంటూరుకు చెందిన స్వచ్ఛాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. ఇందుకు సుమారు రూ.15 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేయగా.... టన్నుకు రూ.758 చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు 62 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలకు బయోమైనింగ్ పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

ప్రజలకు ఉపశమనం

డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తతో గుణుపూరుపేట, కొత్త ముంగినాపల్లి, ముంగినాపల్లి, డి.కొల్లాం గ్రామాలకు చెందిన వారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బంది పడ్డారు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితమై రోగాల బారిన పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా అవస్థలు పడేవారు. గత ప్రభుత్వ హయంలో తీసుకున్న నిర్ణయంతో తాజాగా జరుగుతున్న పనుల వల్ల ఆ ప్రాంత ప్రజలకు త్వరలో మంచి రోజులు రానున్నాయి.

కొనసాగుతున్న బయోమైనింగ్..

గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా పేరుకుపోయిన 2,06,101 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ పద్ధతిలో తొలగించే చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు 82 వేల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్ చేపట్టాం. కాలే స్వభావం ఉన్న ప్రతి వస్తువను విశాఖలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలిస్తున్నాం.

– పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

అవగాహన ర్యాలీ..



హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శాలిని అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా వైద్యారోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ – నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సామాజిక ఆరోగ్యం కేంద్రం వద్ద ప్రారంభమైన ర్యాలీ సుందరపేట గ్రామం వరకు చేపట్టారు. క్రమశిక్షణ కలిగిన జీవనం సాగించనప్పుడే అందరూ ఆరోగ్యవంతంగా ఉంటారని డాక్టర్ శాలిని తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు వెంకటరమణ, ఐసీటీసీ కౌన్సిలర్ పుష్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. – భోగాపురం

రక్తదాన శిబిరం..

నగరంలోని న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బి. రామకృష్ణారావుతో పాటు పలువురు మహిళలు రక్తదానం చేశారు. రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కె. శ్రీనివాసరావు, బుజ్జి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్



పేరుకుపోయిన చెత్త..



ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన చెత్త రోడ్డు మీదకు చేరింది. నగరం నడిబొడ్డున గల పెద్దచెరువు దిగువ భాగంలో గల ధర్మపురికి వెళ్లే ప్రధాన మార్గంలో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్డుపైకి చేరడంతో పాటు మురుగునీరు ఏరులై పారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ సిబ్బంది చెత్తను తొలగించారు.

– విజయనగరం

అన్న సమారాధన

జిల్లా కేంద్రంలోని కోట ప్రాంతం మూడు కోవెళ్ల వద్ద కార్తీక మాసం సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించి,తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

– విజయనగరం ఫొటోగ్రాఫర్



ఉపాధి పనుల కేటాయింపుపై రగడ



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న సభ్యులు

- వాడీవేడిగా నెల్లిమర్ల మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం వాడీవేడిగా జరిగింది. పలు సమస్యలను ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపాధిహామీ వెండర్ ఐడీ పనుల కేటాయింపుపై అధికారులు, సభ్యులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పనులు తమకు కాకుండా ఇతరులకు ఎలా కేటాయిస్తారని సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. తమ పర్యవేక్షణలో పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేయాలని పట్టుబట్టారు. సమావేశంలో ఉపాధిహామీ పనులపై చర్చ ప్రారంభమైన వెంటనే సర్పంచ్‌లు రేవల్ల శ్రీనివాసరావు, గొలజాన నారాయణరావు, అంబళ్ల కిరణ్‌కుమార్, నేతేటి స్వామినాయుడు, తదితరులు కల్పించుకుని పనులు సర్పంచ్‌లకు కాకుండా ఇతరులకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. తమ పర్యవేక్షణలోనే చేపట్టేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచన మేరకు తీర్మానం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు కల్పించుకుని విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. రైతుల నుంచి పూర్తిస్థాయిలో ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రీసర్వే చేపట్టిన గ్రామాల్లో భూ లావాదేవీలతో రైతులు ఇబ్బందుపడుతున్నారని పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. పలువురు వీఆర్వోలు సర్పంచ్‌ల ఫోన్లకు స్పందించడం లేదని బొప్పాడాం, అలుగోలు, తదితర గ్రామాల సర్పంచ్‌లు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం బడ్జెట్ వివరాలను కార్యాలయం ఏఓ సుదర్శనం చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ రాజు, ఈఓపీఆర్‌డీ శంకర్ జగన్నాథ్ పాల్గొన్నారు.

అవగాహనతోనే నియంత్రణ



విజయనగరం ఫోర్ట్: ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేష్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్

విజయనగరం ఫోర్ట్: కేవలం అవగాహనతోనే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారంస స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎయిడ్స్ వ్యాధికి నివారణ లేదని, నిరోధంచడం ఒక్కటే మార్గమని తెలిపారు. రోగుల పట్ల వివక్ష చూపరాదన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ కె. రాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

విజయనగరం అర్బన్: ఎయడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో జరిగిన చైతన్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల రెడ్ రిబ్బన్ ఆకారంలో ప్రదర్శన ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కళాంశాల పోటీల విజేతకు డీఎల్ఎటీ ఆఫీసర్ రాణి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్ధననాయుడు, జిల్లా ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు

పొంచి ఉన్న ప్రమాదం..

- పూసపాటిరేగలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్
- పక్కనే పంచాయతీ భవనం, జనావాసాలు
- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పిల్లర్లకు బీటలేర్పడ్డాయి. రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను ఆనుకుని జనావాసాలు, పంచాయతీ కార్యాలయం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. అయితే వారంతా ట్యాంక్‌ను చూసి భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్

పనిచేస్తున్న వాటర్‌ట్యాంక్..

శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌లోనే ఇప్పటికీ నీరు నింపి సరఫరా చేస్తున్నారు. ట్యాంక్‌కు తూర్పు, దక్షిణ భాగాల్లో రహదారులు ఉండడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే మరో పక్క పంచాయతీ భవనం, ఇళ్లు ఉన్నాయి. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులకు రక్షిత మంచినీటి పథకం పరిస్థితిపై పంచాయతీ అధికారులు నివేదిక ఇచ్చినట్లు పంచాయతీ బోర్డు సభ్యులు చెబుతున్నారు. నూతన రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నిర్మించాలని పూసపాటిరేగ గ్రామస్తులు కోరుతున్నారు.



దెబ్బతిన్న పిల్లర్లు



పెచ్చులూడిన ట్యాంక్ అడుగుభాగం

అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం

శిథిలమైన రక్షిత మంచినీటి పథకం విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. ట్యాంక్‌ను ఆనుకుని పంచాయతీ కార్యాలయం, రెండు వైపుల రహదారులు ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే అధికారులకు లెటర్ ద్వారా తెలియజేశాం.

– టొంపల సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ పంచాయతీ

ట్యాంక్‌ను తొలగించాలి..

ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించాలి. ఇప్పటికే ట్యాంక్ అడుగుభాగంలో పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారింది. అధికారులు ట్యాంక్‌ను తొలిగించడానికి అనుమతులు ఇచ్చి ప్రమాదం నుంచి ప్రజలను కాపాడాలి.

– జి. శ్రీనివాసురావు, గ్రామస్తుడు పూసపాటిరేగ

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక

గంట్యాడ: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) నకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు కె.అశ్విని, టి.పవిత్ర ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని కేజీబీవీ ఎస్ఓ అల్లుజ్యోతి ఆదివారం తెలిపారు. నంద్యాల జిల్లా నంది కొట్కూరులో గత నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన సబ్ జూనియర్ సెపక్ తక్రా పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈజట్టులో కేజీబీవీ విద్యార్థినులు ప్రాతినిధ్యం వహించారు. త్వరలో కేరళలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని ఎంఈఓ బంటు విజయకుమారి, కేజీబీవీ ఎస్ఓ, పీఈటీ భవాని, ఉపాధ్యాయినులు అభినందించారు.